సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

కౌశలం కష్టాలు

- సచివాలయాల్లో సర్వర్ల షట్‌డౌన్
- సక్రమంగా పనిచేయని కౌశలం సర్వే లింక్
- యాప్‌లో వివరాలు అప్‌డేట్ కాక.. దరఖాస్తుదారుల నిరాశ
- నేటితో ముగియనున్న గడువు



ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తుంటే.. బ్లాంక్‌గా చూపిస్తున్న కౌశలం రిజిస్ట్రేషన్ ఫాం



యాప్‌లో వివరాలు నమోదు చేశాక ఓటీపీ రాకుండా నిలిచిపోయిన వెబ్‌సైట్

మర్రిపాలెం: నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన కౌశలం సర్వేలో కష్టాలు ఎదురవుతున్నాయి. వర్క్ ఫ్రం హోం సర్వే ద్వారా ఉపాధి శిక్షణ పొంది.. ఉద్యోగాలు సాధించవచ్చని ఎంతో మంది నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. కౌశలం అనే యాప్‌లో అభ్యర్థి వివరాల అప్‌డేషన్ సక్రమంగా జరగకపోవడంతో వారంతా నిరాశ చెందుతున్నారు. వారి కలలు కలలుగానే మిగిలిపోతాయేమోననే సందేహంలో చాలా మంది ఉన్నారు.

సచివాలయాల చుట్టూ తిరుగుతున్న నిరుద్యోగులు

కౌశలం (వర్క్ ఫ్రం హోం) సర్వే ద్వారా నిరుద్యోగులకు ఆసరాగా నిలిచేందుకు సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. వారు ఇంటింటికీ వెళ్లి 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన ఆసక్తి గల నిరుద్యోగుల పేర్లు సైతం నమోదు చేసుకున్నారు. దీనిపై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల అభ్యర్థులే సొంతంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకునేలా వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పుడు కొత్త కష్టాలు మొదలయ్యాయి. గతంలో నాట్ ఇంట్రెస్టెడ్ అన్న వారు కూడా ఇప్పుడు కౌశలం లింక్ ద్వారా సర్వర్‌లో పేర్లు నమోదు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ 51వ వార్డులోని 6 సచివాలయాలు, 53వ వార్డులోని 4 సచివాలయాల పరిధిలోని చాలా మంది నిరుద్యోగులు



51వ వార్డు వుడా కాలనీ సచివాలయం

ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకున్నారు. కొందరికి కౌశలం యాప్‌లో వ్యక్తిగత, సర్టిఫికెట్ల వివరాలు నమోదై.. మరి కొందరికి అవ్వకపోవడంతో సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సచివాలయ కార్యదర్శుల ముప్పుతిప్పలు

సచివాలయ సెక్రటరీలంతా సాధారణంగా ఒక్కో సర్వీస్ విధులు నిర్వహిస్తుంటారు. కూటమి ప్రభుత్వం పుణ్యమా అని వివిధ సర్వేల మీద బయటే ఉంటున్నారు. దీంతో కొన్ని సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అనేక సర్వేలు వారి నెత్తిన పడేసి చేయాల్సిందేనంటున్న ప్రభుత్వం ముఖ్యంగా కౌశలం సర్వే చేయాలని ఆదేశాలు ఇవ్వడం పెద్ద దుమారం రేపుతోంది. ఈ సర్వే కారణంగా తమ విధులకు ఆటంకం ఏర్పడుతోందని సచివాలయ సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికే వారి పనులు వారికి చాలదన్నట్టు ఇన్‌చార్జిలుగా కూడా ఆయా సచివాలయాల్లో రెండేసి ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇటు కౌశలం సర్వే యాప్‌లో వివరాలు నమోదు కాకపోవడంతో అభ్యర్థులు నిరుత్సాహం చెందుతున్నారు. ఈ విధంగా నిరుద్యోగులతో ఆటలాడటం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వర్ మొరాయింపు.. సేవలకు బ్రేక్

ఈ క్రమంలో గత వారంలో నాలుగైదు రోజుల కిందట వరుసగా సర్వర్ మొరాయించింది. ఈ నెల 15వ తేదీ ఆఖరి గడువు రోజున కూడా సర్వర్ పూర్తిగా డౌన్ అయిపోయింది. సచివాలయాల్లో ఉన్న అన్ని సేవలు నిలిచిపోయాయని సిబ్బంది చెబుతున్నారు. దీంతో గడువు తేదీని కాస్తా ఈ నెల 19కి పొడిగించారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోడానికి చూస్తున్నా.. కొన్ని సందర్భాల్లో కొన్ని వివరాలు తీసుకుని వెబ్‌సైట్ అక్కడితో ఆగిపోతోందని, పూర్తిగా అప్‌డేట్ కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరికి అన్ని వివరాలు తీసుకున్నాక.. ఓటీపీ రావడం లేదని చెబుతున్నారు. మరి కొందరికి విద్యార్హత నింపడానికి సరైన ఆప్షన్ చూపించ పోవడంతో తికమక పడి విసుగు చెందుతున్నారు. ఇలాగైతే అందరికీ ఉద్యోగావకాశాలు వచ్చేనా.. అని ప్రశ్నిస్తున్నారు.



మర్రిపాలెం సచివాలయంలో కౌశలం కోసం దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు

క్లుప్తంగా

ఆర్పీ అలివేణికి పరామర్శ



ఆర్పీ అలివేణిని పరామర్శిస్తున్న పేడాడ జ్యోత్స్న

సీతంపేట: టీడీపీ నాయకుడి వేధింపులు భరించలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఆర్పీ ఎస్.అలివేణిని జగన్నాథపురంలోని ఆమె నివాసంలో గురువారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పేడాడ జ్యోత్స్న పరామర్శించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ ఆర్పీ అలివేణిపై తీవ్ర ఒత్తిడికి గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు సూసైడ్ నోట్ రాశారని, దీనిపై విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, అన్ని విధాలుగా ఇబ్బందులకు, భయాందోళనలకు గురిచేస్తున్నారని తెలిపారు. అలివేణిని పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండుపల్లి సతీష్‌కుమార్, సౌత్ మహిళా అధ్యక్షురాలు వాడపల్లి బంగారమ్మ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మహిళా వాకర్స్ క్లబ్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మురళీనగర్: స్వచ్ఛ విశాఖలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పిలుపునిచ్చారు. ఎన్‌జీజీవోస్ కాలనీలో గురువారం నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక తయారు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ర్యాలీ చేశారు. సిటీ టెరస్ గార్డెన్ అడ్మిన్ మళ్ల సరిత, ఏరియా అడ్మిన్ రమాదేవి రసాయనాలు లేని ఎరువు తయారు చేసే విధానాన్ని వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, క్లాత్ బ్యాగులు వాడాలని సూచించారు. ఎకో ఫ్రెండ్లీ వస్త్ర సంచులు, విత్తనాలు, బంతి పూలు, కనకాంబరం నారు సభ్యులకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.కమల, ఆంధ్రాలక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతో మేలు



మొక్కలు నాటుతున్న రైల్వే అధికారులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు

కంచరపాలెం: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మర్రిపాలెం రైల్వే ట్రైనింగ్ సెంటర్‌లో జీవీఎంసీ సమకూర్చిన కొబ్బరి, సపోట, బాదం తదితర మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ సి.వి.వి.ఎస్.ప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ పి.శ్రీనివాసరావు, ఎస్.అమర్‌నాథ్, రైల్వే అధికారులు, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 41వ వార్డు నాయకులు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ 41వ వార్డు శ్రేణులు లెబన్సీ మానసిక దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వేశంగిబీరావు మాట్లాడుతూ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ దంపతుల సేవలు ఆదర్శనీయమన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్‌కుమార్ యాదవ్, దాలిబాని మధు, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, స్థానికులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో ఆరోగ్య శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా–2025 కార్యక్రమంలో భాగంగా దొండపర్తి డివిజనల్ రైల్వే ఆస్పత్రి వద్ద గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో యుక్త వయసు బాలికలు, మహిళలు, పిల్లల కోసం కేంద్ర వైద్య ఆరోగ్య సంక్షేమ, మహిళా శిశు సంరక్షణ విభాగం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఎనీమియా, హైపర్ టెన్షన్, డయాబెటిస్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, నివారించడం గురించిన పలు ఆరోగ్య పరీక్షలను మహిళలకు రైల్వే హాస్పిటల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 2 వరకు ఆరోగ్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), డాక్టర్ చారుమతి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ లక్ష్మణరావు, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అడ్మినిస్ట్రేషన్), ఈకార్వో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో విస్తృత అవకాశాలు



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు



ప్రసంగిస్తున్న ప్రసన్న కుమార్

మురళీనగర్: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని టిడ్కో మాజీ చైర్మన్ జె.ప్రసన్న కుమార్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల సక్సెస్ పార్టీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశాభివృద్ధిలో సివిల్ ఇంజినీరింగ్ కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని తెలుసుకుని సివిల్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు పడాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సివిల్ ఇంజినీరింగ్ హెడ్ సంధ్యారాణి, స్టూడెంట్ అడ్వైజర్ ఎస్వీ రమణ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు.

బాల్యం విద్యార్థులకు అభినందన



బాల్యం విద్యార్థులతో కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్: బాల్యం కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్‌ను ఆదేశించారు. గురువారం జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జీవీఎంసీ బాల్యం విద్యార్థులను కమిషనర్ అభినందించారు. ఈ నెల 7న జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ కనబరచిన మల్కాపురం, చెంగల్రావుపేట బాల్యం కేంద్రాల్లోని నాలుగేళ్లలోపు విద్యార్థులు కారే హరి లిశిక, డోమనా గ్రీష్మ ఆంగ్ల పద్యాల కేటగిరీలో విజేతలుగా నిలిచారని, ఆర్‌పీ పేట, ప్రగతినగర్ బాల్యం కేంద్రంలోని నాలుగేళ్ల చిటికెల హన్విక, పిల్లి ప్రణతి ఫ్యాన్సీ డ్రెస్ కేటగిరీలో విజేతలుగా నిలిచారని, వీరికి ఢిల్లీలోని చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ నిర్వాహకులు మెడల్స్, షీల్డ్స్, ధ్రువీకరణ పత్రాలు అందించారని కమిషనర్ పేర్కొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్ హెచ్.శంకర్రావు, బాల్యం ప్రాజెక్టు కో–ఆర్డినేటర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల బంద్ విజయవంతానికి పిలుపు

దాబాగార్డెన్స్: స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20న చేపట్టనున్న బంద్ విజయవంతం చేయాలని ఆలిండియా గిగ్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైడర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. విశాఖ జిల్లాలో గత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో ప్లాట్‌ఫారమ్‌లో పని చేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు ప్రతిరోజూ సమాజానికి సేవలందిస్తున్నా, వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చదివిన చదువుకు తగ్గ ఉపాధి లేకపోవడంతో గిగ్ వర్క్ వైపు మొగ్గు చూపాల్సి వచ్చిందని, వారికి ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించే నాథుడే లేరన్నారు. అక్రమంగా తొలగించిన రైడర్ల ఐడీలను వెంటనే పునరుద్ధరించాలని, మినిమం గ్యారెంటీ వేతనం అమలు చేయాలన్నారు. పీక్ టైం కంపల్సరీ విధానం తగ్గించాలని, ఇన్సెంటివ్ విధానం ఉండాలని, ఫేక్ నోటిఫికేషన్లు తొలగించాలన్నారు. క్యాన్సిలేషన్ ఫీజు చెల్లించాలని, బేస్ ఫెయిర్ కనీసం రూ.30కి పెంచాలని, కిలోమీటరుకు సాధారణ సమయంలో రూ.10, పీక్ టైంలో రూ.12 తక్కువ లేకుండా ఇవ్వాలన్నారు. ఏడేళ్ల కిందట పెట్రోల్ ధర రూ.76 ఉన్నప్పుడే ఆదాయం బాగా వచ్చేదని, ఇప్పుడు లీటర్ పెట్రోల్ రూ.108కి పెరిగిందని, లాగెన్ హవర్స్ పెరిగాయని, ఆర్డర్స్ కూడా పెరిగాయని, నిత్యావసర ధరలు పెరిగాయని, కానీ రైడర్లకు వచ్చే ఆదాయం నానాటికీ తగ్గిపోతుందన్నారు. సమ్మెలో భాగంగా ఈ నెల 22న చలో కలెక్టరేట్, 24న ఎమ్మెల్యే కార్యాలయాల ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.కుమారమంగళం, అచ్యుత్, నాని రమేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 28న ఏయూలో సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ ఫార్మాసిటికల్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచితో కలిసి నవంబర్ 28న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, వి.గిరిజా శాస్త్రి, ఎమ్.మురళీకృష్ణ కుమార్, పి.శైలజ, అరుణ్ సంతోష్ పాల్గొన్నారు.

పంతుల లలితకు సాహితీ కిరీటి పురస్కారం



సీతంపేట: నగరానికి చెందిన కవయిత్రి పంతుల లలిత సాహితీ కిరీటి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 28న శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో జరగనున్న సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో ఆమె పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా రైటర్స్ అకాడమీ సభ్యులు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సభ్యులు, మేడా బుజ్జమ్మ మెమోరియల్ ట్రస్టు సభ్యులు లలితను అభినందించారు.

చిరు వ్యాపారులపై ప్రతాపం అన్యాయం

సీతంపేట: ఏళ్ల తరబడి రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న చిరు వ్యాపారుల కడుపు కొట్టేలా దౌర్జన్యంగా దుకాణాలు తొలగించడం అన్యాయమని విశాఖ ఫుట్‌పాత్ అండ్ తోపుడుబళ్ల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.ప్రకాష్, జి.వామనమూర్తి మండిపడ్డారు. నగరంలోని సీతంపేట, శంకరమఠం, నరసింహనగర్ ప్రాంతాల్లో చిరు వ్యాపారాలను ఉన్న పళంగా తొలగించి రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులు పేద చిల్లర వర్తకులపై ప్రతాపం చూపడం అన్యాయమన్నారు. ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి కోసం అప్పులు చేసి రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వర్తకుల కడుపు కొట్టేలా, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పొక్లెయిన్‌తో దుకాణాలను తొలగించి లారీల్లో తరలించుకుపోవడం అన్యాయమన్నారు. 2014 వీధి విక్రయదారుల చట్టాన్ని వెంటనే అమలు చేసి, హాకర్ జోన్స్ ఏర్పాటు చేసి చిరు వ్యాపారుల జీవనానికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.


తప్పిపోయిన 2 గంటల్లోనే బాలుడి ఆచూకీ లభ్యం



కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: తప్పిపోయిన మూడున్నరేళ్ల బాలుడిని రెండు గంటల్లోనే వన్‌టౌన్ పోలీసులు వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తన సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టౌన్ కొత్తరోడ్డుకు చెందిన నాయుడు తన భార్యతో కలిసి స్థానికంగా నివాసం ఉంటున్నాడు. వీరి మూడున్నరేళ్ల కుమారుడు రిత్విక్‌రాజ్‌తో కలిసి బయటికి వెళ్లేందుకు గురువారం ఉదయం వచ్చారు. ఈ క్రమంలో రిత్విక్ వారి నుంచి తప్పిపోయాడు. తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జీడీ బాబు స్పందించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. తప్పిపోయిన బాలుడిని రెండు గంటల్లోనే వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైద్య శిబిరాల పరిశీలన



పిఠాపురం కాలనీ యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం పరిశీలించారు. ఎం.ఎస్.ఆర్. పట్టణ ఆరోగ్య కేంద్రం, పిఠాపురం కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిఠాపురం కాలనీలో సిబ్బంది, వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్త్రీలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, సికిల్ సెల్ అనీమియా, పోషణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. డాక్టర్ బి.ఉమావతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ ఆగ్రహం



ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు తొలగించాలని ఆదేశిస్తున్న జీవీఎంసీ కమిషనర్



కప్పరాడలో పేరుకుపోయిన వ్యర్థాలను చూసి మండిపడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కంచరపాలెం: వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ శానిటరీ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మండిపడ్డారు. జోన్–5 పరిధి 47వ వార్డులోని కంచరపాలెం, కప్పరాడ కొండవాలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. వార్డులోని రోడ్లు, కాలువలపై వ్యర్థాలు పేరుకుపోయి అస్తవ్యస్తంగా ఉండటాన్ని గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 260, 270 సచివాలయ శానిటరీ కార్యదర్శులు నందకిషోర్, ఝాన్సీల మొబైల్ ఫోన్ ద్వారా ముఖ గుర్తింపు హాజరు(ఎఫ్ఆర్ఎస్)ను పరిశీలించి, పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కాలువలు దాటి రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా దుకాణాలను వెనక్కి తరలించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను యుద్ధప్రాతిపదికన తొలగించి, వాటి కింద వ్యర్థాలను శుభ్రపరచాలన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సీతంపేట: చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ లైన్స్ మెయింటెనన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శాంతిపురం, కైట్స్ జూనియర్ కళాశాల, సీతంపేట, గణేష్‌బాబు ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జోన్–2 పరిధిలో..

మర్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి 11 కేవీ ఎయిర్‌పోర్ట్, శాంతినగర్ ఫీడర్ల నిర్వహణ, మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాధవధార, సాయినగర్, పార్వతీనగర్, టాటా మోటర్స్ ఏరియా, జాకీర్ హుస్సేన్ నగర్, ఎన్ఏడీ, గణేష్‌నగర్, కరాస, గౌరీనగర్, శాంతినగర్, అంబేడ్కర్ కాలనీ, నేతాజీనగర్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

పోటీతత్వంతోనే వ్యక్తిత్వ వికాసం



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపక బృందం



డ్యాన్స్ పోటీలో ప్రతిభ చూపుతున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది వార్షికోత్సవాల నిర్వహణలో భాగంగా గురువారం జోనల్ స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు డిబేట్, డ్యాన్స్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన విలువలు పెంచుకుంటారన్నారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రభుత్వ కళాశాలల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. డిబేట్ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన వి.భవానీ, సీహెచ్ తరణి, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.జయ, పాజిటివిటీ ఆర్గ్యుమెంట్‌లో మూడు స్థానాల్లో నిలవగా, నెగిటివిటీలో జి.వైష్ణవి, ఎస్.తులసి, కె.శిరీష మూడు స్థానాల్లో నిలిచారు. సోలో సింగ్ పోటీలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.జ్యోతి, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి బి.దేవి, డి.జ్యోతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గ్రూప్ సింగింగ్‌లో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఝాన్సీ అండ్ టీం, సాహితీ అండ్ టీం, ఎలీసా టీం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. డ్యాన్స్ పోటీల్లో సౌమ్య అండ్ టీం (విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల), కృష్ణవేణి అండ్ టీం (శ్రీకాకుళం), అను అండ్ టీం (చింతపల్లి) విజయం సాధించాయి. కార్యక్రమంలో కళాశాల కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కేఎల్ శిరీష, బి.రాధమ్మ, విజయ ప్రశంస, జి.జ్యోతి ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

